క్లుప్తంగా

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మస్జిద్ ఏ జన్నతల్ ఫిర్దోస్ ఆధ్వర్యంలో ఆదివారం వాంబే కాలనీలో ముస్లింలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం విచారకరం అని, ముస్లింల హక్కులను కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింల హక్కులను హరించే వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మసీదు సెక్రటరీ షేక్ బాజీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం దేశ సేవకు అంకితం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంబేడ్కర్ జీవితం దేశ సేవకు, సమాజ అభ్యున్నతికి అంకితమైందని ప్రఖ్యాత రచయిత హనుమాన్‌సింగ్ రాథోడ్ అన్నారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం అఖిల భారతీయ రాష్ట్రీయ షైక్షిక్ మహాసంఘ ఆధ్వర్యంలో 'రాష్ట్ర ఋషి బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితం – రచనలు' అనే అంశంపై ఆన్‌లైన్ ఉపన్యాస కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. అంబేడ్కర్ ప్రయాణం, వారసత్వం గురించి వివరించారు. అంబేడ్కర్ అసాధారణమైన ప్రతిభ కలిగిన వ్యక్తి అని అభివర్ణించారు. కార్యక్రమానికి కోశాధికారి శ్రీ సంజయ్‌కుమార్ రౌత్ సంధానకర్తగా వ్యవహరించారు. స్వాగత, వక్త పరిచయాన్ని అధ్యక్షుడు ప్రొఫెసర్ నారాయణ్ లాల్ గుప్తా సమర్పించారు. కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ అర్బిందో మహతోతో పాటు దేశవ్యాప్తంగా 3,000 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు పాలన ఆదర్శనీయం



విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణదేవరాయాలు పాలనను ఆదర్శంగా తీసుకోవాలని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ సాంస్కృతిక కమిటీ వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు అన్నారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద ఆదివారం చలివేంద్రం, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు స్ఫూర్తితో 12 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం, పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల కుటుంబరావు, బొర్రా రామకృష్ణ, ఎస్ సాంబశివరావు పాల్గొన్నారు.

భర్త చావుకు కారణమైన వారిపై భార్య ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన భర్త చావుకు కారణమైన వారిని శిక్షించాలని కోరుతూ గొల్లపూడి వన్‌సెంటర్‌కు చెందిన కోకా శశిరేఖ భవానీపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడికి చెందిన కోకా శశిరేఖకు చంద్రశేఖర్‌తో 2021లో వివాహమైంది. చంద్రశేఖర్ అనారోగ్యంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే ఆసుపత్రిలో చేర్చిన విషయం కూడా తనకు చెప్పలేదని, తన భర్త బతకడానికి అవకాశం ఉన్నప్పటికీ ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో అత్త పద్మావతి, బావ వెంకటశివకుమార్, తోడికోడలు అపర్ణ ఉద్దేశపూర్వకంగానే చంద్రశేఖర్‌ను కోలుకోనీయకుండా చేసి చావుకు కారణమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

బిక్కుబిక్కుమంటున్న వ్యాపారులు

కేబీఎన్ కాంప్లెక్స్ పెచ్చులూతుండటంతో ఆందోళన

- సెల్లార్‌లో పెచ్చులు పడటంతో ధ్వంసమవుతున్న వాహనాలు
- పట్టించుకోని వీఎంసీ ఎస్టేట్ విభాగం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, వినియోగదారులు



పాతబస్తీలోని కేబీఎన్ మునిసిపల్ కాంప్లెక్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కాకరపర్తి భావనారాయణ మునిసిపల్ కాంప్లెక్స్‌లోని వ్యాపారులను కలవరపాటుకు గురి చేస్తోంది. నగరపాలకసంస్థ అధికారులు నిర్లక్ష్యంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వ్యాపారులు, వినియోగదారులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వన్‌టౌన్‌లోని భావనారాయణవీధి, పులిపాటి వారి వీధి రెండు రహదారులను కలుపుతూ కాకరపర్తి భావనారాయణ మునిసిపల్ కాంప్లెక్స్ ఉంది. ఈ కాంప్లెక్స్‌లో వందకు పైగా చిన్న, పెద్ద దుకాణాలు పని చేస్తున్నాయి. వాటికితోడు కాంప్లెక్స్ దిగువన సెల్లార్‌లో వాహనాల పార్కింగ్‌కు నగరపాలకసంస్థ లీజుకు ఇచ్చింది. నిత్యం వేలాది మంది వినియోగదారులతో పాటుగా వ్యాపారులు ఈ కాంప్లెక్స్‌లో రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రమాదభరితంగా శ్లాబ్..

కాకరపర్తి భావనారాయణ కాంప్లెక్స్ సెల్లార్, మొదటి అంతస్తులకు సంబంధించిన శ్లాబ్‌ల నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. నిత్యం ఏక్కడో ఒకచోట శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిమీద పడటంతో వ్యాపారులు భయకంపితులవుతున్నారు. అలాగే సెల్లార్‌లోని పలు చోట్ల శ్యాబ్ భాగం నుంచి సిమెంట్ రాళ్లు ఊడిపడుతుండటంతో వాహనాలు ధ్వంసమవుతున్నాయి. పలుమార్లు వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లటానికి వచ్చిన వినియోగదారుల పైన పడటంతో చిన్నపాటి దెబ్బలు సైతం తగిలి ఆస్పత్రికి పరిగెత్తాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో వ్యాపార వర్గాలతో పాటుగా కొనుగోళ్లకు వచ్చే వినియోగదారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శ్లాబ్ నుంచి ఊడుతున్న పెచ్చులు



సెల్లార్‌లో వాహనంపై పడిన పెచ్చులు

పట్టించుకోని అధికారులు..

కాంప్లెక్స్ లీజు వ్యవహారాలను పర్యవేక్షించే విజయవాడ నగరపాలకసంస్థ ఎస్టేట్ విభాగం అధికారులు భవనంపై ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవటం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా పెచ్చులు ఊడి పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. దురదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదంటూ వారు ప్రశ్నిస్తున్నారు. నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టాలని వినియోగదారులు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతుల ఆత్మహత్యలు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతు ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారాయని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. సాగువేళ తుఫానులు, వరదలు, వర్షాభావ పరిస్థితులు వంటి ప్రకృతి వైపరీత్యాలు ముప్పేట దాడి చేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అన్నదాతల పాలిట మృత్యుపాశాలుగా మారాయని అన్నారు. చందర్లపాడులో కౌలు రైతు బత్తుల వీరబాబు ఆత్మహత్య చేసుకోవడం బాధాకమని అన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే పది నెలల కూటమి పాలనలో ఆత్మహత్యలకు పాల్పడిన వారి సంఖ్య వంద దాటిందంటే రైతులు ఎంతటి దయనీయ స్థితిలో ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఇక అనధికారికంగా చూసుకుంటే వీరి సంఖ్య 200కి పైనే ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకున్న వారిలో రాయలసీమ జిల్లాలకు చెందిన వారే అత్యధికంగా ఉన్నారన్నారు. ఏ ఒక్కరికి కూడా ఈ ప్రభుత్వం పరిహారం ఇచ్చిన పాపాన పోలేదన్నారు.

సాయం ఊసే లేదు

డివిజన్ స్థాయి త్రీమెన్ కమిటీ సిఫార్సు మేరకు నిర్దేశిత గడువులోగా బాధిత రైతు కుటుంబానికి పరిహారం అందించేలా జిల్లా ఉన్నతాధికారులు వ్యవసాయ శాఖకు నివేదిక సమర్పించాలనే విధానాన్ని గత ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కాని కూటమి ప్రభుత్వంలో రైతు ఆత్మహత్య తర్వాత బాధిత కుటుంబాలు స్పందనలో అర్జీలు ఇచ్చినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన మిర్చి, పత్తి, వరి, మొక్కజొన్న రైతులు తమ కష్టాన్ని దళారులపాలు చేస్తున్న దయనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అస్తవ్యస్త విధానాలతో ఇప్పటివరకు 200 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. కాని వీరికి పరిహారం విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

అక్కినేని నటన భావినటులకు ఆదర్శం

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నటజీవితాన్ని భావినటులు ఆదర్శంగా తీసుకోవాలని అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, జేఎస్ఎస్ సరాగాలు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, బెజవాడ బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీదెళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగమని పేర్కొన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ గురించి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ప్రజలకు న్యాయం చేరువ అయ్యేందుకు నిత్యం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులకు సత్కారం



బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులను సత్కరించిన నిర్వాహకులు

బెజవాడ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎకే భాషా, ఉపాధ్యక్షుడు పిల్లా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, క్రీడల కార్యదర్శి పలగాని రవిబాబు, కోశాధికారి ఎమ్ సత్యనారాయణ, గ్రంథాలయ కార్యదర్శి కంచర్ల త్రినాథ్ కుమార్, మహిళా కార్యదర్శి కే అనూరాధ, జాయింట్ సెక్రటరి జీ వరాహలక్ష్మిని ఆత్మీయంగా సత్కరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. షీటర్లపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని, మంచి నడవడితో కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని సూచించారు. ఏదైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ

ఘనంగా మట్టల ఆదివారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): తనను తాను తగ్గించుకొన్నవాడు హెచ్చింపబడతాడని బైబిల్‌లో చెప్పిన మాటలు దేవుడు ఇహలోకంలో చేసి చూపించారని ఆల్ ఇండియా బీసీటీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ మంగలపూడి జోసెఫ్ అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలోని చర్చిలలో సండే స్కూల్ చిన్నారులు ఈత మట్టలను చేత పట్టుకొని యేసుక్రీస్తుకి జయహో అంటూ ఎలుగెత్తి పాటలు పాడారు. పుర వీధుల్లో తిరుగుతూ క్రీస్తు పాటలు పాడుకుంటూ ప్రజల్లో ఉజ్జీవం నింపారు. ఈ సందర్భంగా బీసీటీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ జోసెఫ్ మాట్లాడుతూ మానవాళి పాపం నిమిత్తం దైవ కుమారుడు మానవ కుమారుడై భూలోకానికి వచ్చి మరణానికి ఎదురెళ్లిన మహారాజు క్రీస్తు అని అన్నారు. కార్యక్రమంలో ఎన్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పామ్స్ డే కార్యక్రమంలో బీసీటీసీ నాయకులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

పటమట(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు జోనల్ కార్యాలయాల్లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దయిందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

దుర్గగుడికి పోటెత్తిన భక్తజనం

- రద్దీ నేపథ్యంలో అంతరాలయ దర్శనం రద్దు
- సర్వ దర్శనానికి రెండు గంటలు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వీకెండ్ వరుస సెలవులు, ఇంటర్ పరీక్ష ఫలితాలు, అమ్మవారి శుభాశీస్సుల కోసం విచ్చేసిన కొత్త జంటలు, వారి కుటుంబ సభ్యులతో ఇంద్రకీలాద్రిపై పండుగ వాతావరణం కనిపించింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం 10 గంటలకే ఘాట్‌రోడ్డు ద్విచక్ర వాహనాలతో నిండిపోగా, హెడ్ వాటర్ వర్క్స్, సీతమ్మ వారి పాదాలు, కెనాల్‌రోడ్డులో కార్లు, ఇతర రవాణా వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఘాట్‌రోడ్డు, మహా మండపం మీదగా కొండపైకి చేరుకున్న భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

భక్తులకు మజ్జిగ పంపిణీ..

ఘాట్‌రోడ్డులో సమాచార కేంద్రం, మహా మండపంలో ఆరో అంతస్తు వరకు క్యూలైన్లు నిండిపోవడంతో అంతరాలయ దర్శనం రద్దు చేశారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం దిగువన ఉన్న కౌంటర్లలో రూ.500 టికెట్లు విక్రయించవద్దని ఆలయ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వీఐపీలకు, ప్రముఖులకు, సిఫార్సులపై వచ్చే వారికి సైతం ముఖ మండప దర్శనం కల్పించారు. రూ.300, రూ.100 టికెట్ల క్యూలైన్ కూడా భారీగా ఉండటంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థాన అధికారులు చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లు త్వరత్వరగా ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు. ఎండ వేడి నుంచి భక్తులకు ఉపశమనం కలిగించేందుకు ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం, లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. ఇక అమ్మవారికి నిర్వహించిన ఆర్జిత సేవలతో పాటు సాయంత్రం పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు పాల్గొన్నారు.

గణపతి సచ్చిదానందస్వామి సేవలో వెలంపల్లి, మల్లాది విష్ణు



విజయవాడ కల్చరల్: అవధూత గణపతి సచ్చిదానంద స్వామిని మాజీ దేవదాయ శాఖామంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు మాజీ చైర్మన్ మల్లాది విష్ణు ఆదివారం రాత్రి పడమట దత్తపీఠంలో కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు. స్వామిజీ వారితో ముచ్చటిస్తూ జూన్ ఐదు నుంచి 15వ తేదీ వరకు మైసూర్ దత్తపీఠంలో జరిగే వృక్ష మహాయజ్ఞానికి విచ్చేయమని ఆహ్వానించారు. దీంతో వారు ఇరువురు తప్పక హాజరు అవుతామని తెలిపారు. కాగా నగరంలో బబ్బూరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న కార్యక్రమానికి స్వామిజీ ఆదివారం హాజరయ్యారు.

ఉచిత యోగా శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): నేటి కాలంలో యోగా మంచి జీవన విధానం అని, క్రమం తప్పకుండా అందరూ అభ్యాసం చేయాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ఆదివారం పటమటలోని దత్త పీఠంలో జరిగిన దత్తక్రియ యోగా శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. యోగాసనాలపై అవగాహన కల్పించారు. దత్త క్రియాయోగ అంతర్జాతీయ కేంద్రం, మైసూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రకాష్ మాట్లాడుతూ నగరంలో మూడు రోజుల పాటు జరిగే ఈ యోగా శిక్షణ తరగతులు దత్తపీఠంలో ఉచితమన్నారు. ప్రతిరోజు కనీసం ఒక 40 నిమిషాల పాటు ధ్యానం చేయాలని తద్వారా ఎన్నో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు పొందవచ్చని ఆయన తెలిపారు. దత్త క్రియా యోగ పటమట ప్రాంత సమన్వయకర్త అరుణ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి ఏడు గంటల వరకు పటమటలోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుబంధాల సంబరం.. అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సందడిగా విక్రమ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమావేశం

పటమట(విజయవాడతూర్పు): మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని విక్రమ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పటమటలో సందడిగా జరిగింది. విక్రమ్ యూనివర్సిటీలో 1960 దశకం నుంచి ఇప్పటి వరకు వివిధ బ్రాంచులు, కోర్సుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎం. ఫిల్, డాక్టరేట్ చేసిన వారంతా ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులు తమ వయస్సును, దూరాభారాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చి, ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో ప్రఖ్యాత విద్యావేత్తలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ప్రతిష్టాత్మక సంస్థల్లో కీలక హోదాల్లో పని చేసిన, చేస్తున్న వారే కాకుండా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు విక్రమ్ విశ్వ విద్యాలయం తమను ఏ విధంగా తీర్చిదిద్దిందో, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో ఏ విధంగా తోడ్పడిందో వివరించారు.

గురువుకు నివాళి..

అనంతరం విక్రమ్ యూనివర్సిటీలో జియాలజీ విభాగాధిపతిగా పని చేసి, ఎందరెందరో తెలుగు విద్యార్థులు అక్కడ చదువుకునేందుకు తోడ్పడిన ప్రొఫెసర్ సూర్యదేవర సుబ్బారావును స్మరించుకుని, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. దివంగతులైన తమ తోటి విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించి, వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వర్సిటీ ప్రస్తుత వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అర్పణ్ భరద్వాజ్ వీడియో సందేశం పంపారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎస్‌ఆర్‌ఐ కళాశాల సీఈఓ చంద్రశేఖర్, డీన్ సూర్యనారాయణ ఆదివారం అభినందించారు. ఎస్‌ఆర్‌ఐ కళాశాలకు చెందిన రెండో సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఐ. స్వాతి ఐశ్వర్యలక్ష్మి 990, ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఆర్. వర్ష కన్వర్ 466, బైపీసీలో ఎం. మేఘన 433 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు.

ఎస్‌జీఎఫ్‌ఐ పోటీల్లో రాష్ట్ర విద్యార్థుల సత్తా

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్–17 వెయిట్‌లిఫ్టింగ్, అండర్–19 తంగ్–టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఏపీ విద్యార్థులు సత్తా చాటినట్లు ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఈ పోటీలు జరిగినట్లు తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్ 17 బాలికల 71 కేజీల విభాగంలో చల్లాబత్తుల జుహితగుణ(కాకినాడ) బంగారు పతకం, 59 కేజీల విభాగంలో చుక్కా కీర్తన(ఏలూరు జిల్లా) రజిత పతకం, 76 కేజీల విభాగంలో బిట్ర రోచిస్మతి(గుంటూరు జిల్లా) రజిత పతకం, తంగ్–టా మార్షల్ ఆర్ట్స్ అండర్–19 బాలికల 62 కేజీల విభాగంలో మనుబోలు భాను ప్రియ(ఎన్టీఆర్ జిల్లా) కాంస్య పతకం, 70 కేజీల విభాగంలో పుడి దుర్గ(అనకాపల్లి జిల్లా) కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. జాతీయ పోటీల్లో రాష్ట్రానికి బంగారు, రెండు రజిత, రెండు కాంస్య పతకాలు అందించిన క్రీడాకారులను, కోచ్‌లు కె.నాగశిరీష్, వి.కొండబాబులను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు, స్కూల్ గేమ్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ అభినందించారు.



వెయిట్‌లిఫ్టింగ్, మార్షల్ ఆర్ట్స్ జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు